క్లుప్తంగా

తిరుమల బాలాజీ దివ్యక్షేత్ర నిర్మాణానికి శ్రీకారం



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న బాలాజీ దంపతులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్‌టీబీఎల్ సినీ వరల్డ్ ప్రాంగణంలో శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం నిర్మాణానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఆలయ నిర్మాణాకి ఎస్‌టీబీఎల్ ప్రాజెక్ట్ అధినేత గుత్తికొండ బాలాజీ దంపతులు భూమిపూజ చేశారు. త్రి ప్రాకార విమాన శైలిలో ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు ప్రాజెక్ట్ ప్రతినిధులు తెలిపారు. ఆలయ నిర్మాణం శంకుస్థాపనకు విచ్చేసిన భక్తులు తమ స్వహస్తాలతో ఇటుకలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌టీబీఎల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ లైబ్రేరియన్‌గా చంద్రకళ



అవార్డు అందుకొంటున్న చంద్రకళ

గాజువాక : గాజువాక శాఖ గ్రంథాలయాధికారి బి.చంద్రకళకు ఉత్తమ లైబ్రేరియన్ అవార్డు లభించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆమెకు ఈ అవార్డును కలెక్టర్ మల్లికార్జున ప్రదానం చేశారు. గ్రంథాలయ విధులతో పాటు గ్రంథాలయ పాఠకుల అభిరుచులను తెలుసుకోవడం, వాటికనుగుణంగా పుస్తకాలను సమకూర్చడంలో ఆమె చేస్తున్న కృషికి ఈ అవార్డు లభించింది. అవార్డు అందుకున్న సందర్భంగా ఆమెను సహచరులు, గ్రంథాలయ పాఠకులు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న కార్పొరేటర్ స్టాలిన్

గాజువాక : స్నేహపురి కాలనీలో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ చెప్పారు. స్నేహపురి రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 11వ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ పనులను పూర్తి చేస్తామన్నారు. వార్డు నివాస్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఎం.రమేష్ కుమార్ మాట్లాడుతూ కాలనీలో మౌలిక వసతులపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని కోరారు. వాయిస్ ఆఫ్ గాజువాక అధ్యక్షుడు టి.వి.నాగేశ్వరరావు, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రమణారావు, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గాజువాక మండల ఇన్‌చార్జిగా వాడపల్లి



అగనంపూడి: జగనన్న సచివాలయ కన్వీనర్ల గాజువాక మండల ఇన్‌చార్జిగా వైఎస్సార్‌సీపీ జిల్లా సీనియర్ నాయకుడు వాడపల్లి రామచంద్రరాజు నియమితులయ్యారు. జీవీఎంసీ 79, 85, 86, 87, 88 వార్డుల్లోని సచివాలయాల కన్వీనర్లకు గాజువాక మండల ఇన్‌చార్జిగా ఆయన్ను నియమించారు. ప్రతీ వార్డు సచివాలయ పరిధిలో నియమితులైన కన్వీనర్లకు సమన్వయకర్తగా రామచంద్రరాజు వ్యవహరించనున్నారు.

రోడ్డు పనుల పరిశీలన

పెదగంట్యాడ: 65వ వార్డు కాకతీయ లోవకు వెళ్లే రహదారి పనులను కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఈ ప్రాంతంలో సరైన రహదారి లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడేవారన్నారు. పనులను చకచకా పూర్తి చేసి రోడ్డును వినియోగంలోకి తీసుకువస్తామన్నారు.

ఉక్కు గర్జనకు మద్దతుగా..



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు



ర్యాలీలో పాల్గొన్న నాయకులు, ఉక్కు ఉద్యోగులు

- కదిలిన ప్రజా సంఘాలు
- గాజువాకలో భారీ ర్యాలీ

గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలన్న డిమాండ్‌తో ఈ నెల 30న తలపెట్టిన ప్రజాగర్జనకు మద్దతుగా వివిధ సంఘాలు గాజువాకలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించాయి. వివిధ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, వ్యాపార సంఘాలు, అఖిలపక్ష రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో స్థానిక వంటిల్లు జంక్షన్ వద్ద ప్రారంభమైన ర్యాలీ కణితి రోడ్ మీదుగా కొత్తగాజువాక, మెయిన్ రోడ్ మీదుగా పాతగాజువాక చేరుకుంది. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సాగుతున్న పోరాటానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు తాను పూర్తిస్థాయిలో కృషి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌పై ఆధారపడి లక్షలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే ఉంచాలన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజలు, కార్మికులు ఐక్యంగా పోరాడి ప్లాంట్‌ను పరిరక్షించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, ఉక్కు పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్య రామ్, నాయకులు మాటూరు శ్రీనివాసరావు, డి.ఇ.వి.అప్పారావు, మార్టుపూడి పరదేశి, గంట్యాడ గురుమూర్తి, ఉరుకూటి అప్పారావు, ధర్మాల శ్రీను, పులి వెంకట రమణారెడ్డి, ప్రసాదుల శ్రీనివాస్, ఎస్.రామారావు, కసిరెడ్డి సత్యనారాయణ, ఎం.రాంబాబు, అచ్చిబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు గర్జనతో కేంద్రానికి కనువిప్పు

అగనంపూడి: ఉక్కు త్రిష్ణ గ్రౌండ్స్‌లో ఈ నెల 30న నిర్వహించనున్న ఉక్కు ప్రజాగర్జనలో నిర్వాసితులు, కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని అగనంపూడి హార్టికల్చర్ సొసైటీ అధ్యక్షుడు నెల్లి శ్రీనివాసరావు కోరారు. హార్టికల్చర్ సొసైటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాగర్జన కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కల్గించాలన్నారు. సొసైటీ కార్యదర్శి వి.ఈశ్వరరావు, ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు బి.సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ డీవీఎస్‌రావు, వి.రాము, సీడబ్ల్యూసీ కార్యదర్శి కె. పైడిరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఉప్పెనలా ఉక్కు ఉద్యమం



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు ఉద్యమం ఉప్పెనలా మారుతోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఎన్నో త్యాగాలకోర్చి సాధించుకున్న పరిశ్రమను పరిరక్షించుకునేందుకు ఐక్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తూ నిర్వహిస్తున్న ఉక్కు మహాగర్జనను విజయవంతం చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షల్లో 715వ రోజు శుక్రవారం ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్ కార్మికులు పాల్గొన్నారు. పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు, గుమ్మడి నరేంద్ర మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం ఇలా సంస్థలను అమ్ముకుంటూ పోతే భారతదేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థ మిగలదన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, కార్మికులంతా ఐక్యంగా ఉంటూ, ఉద్యమాన్ని ఉధృతం చేయాలని కోరారు. ఈ నెల 30న నిర్వహించ తలపెట్టిన ఉక్కు ప్రజాగర్జనను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ నాయకులు టి.భాస్కరరావు, ఎ.అప్పారావు, ఎస్.పాపారావు, ఎస్.గోవిందు, డి.వి.రమణ, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పోరాటాలపై అవహేళన చేస్తే మూల్యం తప్పదు



మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు

ఉక్కునగరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై జరిగే పోరాటాలను అవహేళన చేస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు అన్నారు. సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వ్యతిరేకతపై పోరాడుతున్న వారిలో మత విద్వేషాలను సృష్టించడం, ఐక్యతకు విఘాతం కలిగించడం, ప్రజాధనాన్ని కార్పొరేట్ శక్తులకు ధారపోయడం కేంద్ర ప్రభుత్వ విధానంగా మారిందన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం దేశ పరిశ్రమల రక్షణ ఉద్యమాలకు స్ఫూర్తిదాయకమన్నారు. అనకాపల్లి జిల్లా సీఐటీయూ కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం అనుసరిస్తున్న విధానాలు దారుణమన్నారు. జిల్లా జాక్ కన్వీనర్ ఎం. జగ్గునాయుడు, సీఐటీయూ నాయకులు వై.టి.దాస్, కె.ఎం.శ్రీనివాస్, ఎన్.రామారావు, యు.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం అందరి బాధ్యత



ప్రసంగిస్తున్న ఏడీసీ సన్యాసిరావు



రోడ్లు శుభ్రం చేస్తున్న జీవీఎంసీ అధికారులు

గాజువాక : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండటం అందరూ బాధ్యతగా తీసుకోవాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు కోరారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 కార్యక్రమంపై మార్కెట్ మెయిన్ రోడ్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక విధాలుగా ప్రజలకు వివరించామన్నారు. భావితరాలకు కాలుష్యరహిత పర్యావరణాన్ని అందించడానికి అందరూ సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి స్థాయిలో నిషేధించగలిగినప్పుడే ఇది సాధ్యమవుతుందని చెప్పారు. ఇళ్లలో చెత్తను కూడా తడి, పొడి, ప్రమాదకర చెత్తలుగా విభజించి క్లాప్ వాహనాలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ అధికారులు రోడ్లు శుభ్రం చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ బ్రాండ్ అంబాసిడర్ ప్రసన్నకుమార్, జోనల్ కమిషనర్ పి.సింహాచలం, సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌ను చూసి భయపడతారనడం హాస్యాస్పదం



సమావేశంలో మాట్లాడుతున్న పరదేశి

ఉక్కునగరం: నారా పప్పు లోకేష్ పాదయాత్రను చూసి వైఎస్సార్‌సీపీకి వణుకు పుడుతుందని కొంత మంది టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి అన్నారు. స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ స్టోర్స్ వద్ద శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యక్షంగా ఒక కార్పొరేటర్‌గా గెలవలేని వ్యక్తిని చూసి భయపడే పరిస్థితిలో వైఎస్సార్‌సీపీ లేదన్నారు. ఎమ్మెల్యేగా ఓడిపోయి, ఎమ్మెల్సీగా దొంగదారిలో శాసనమండలిలో దూరిన లోకేష్ ప్రజలకు చేసిందేమిటని ప్రశ్నించారు. సరిగ్గా మాట్లాడటం చేతగాని ఆ వ్యక్తిని చూసి తమ పార్టీ భయపడుతుందంటే ప్రజలు నవ్వుతున్నారన్నారు. అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అన్ని వర్గాల ఆదరణతో ముందుకు సాగుతున్న తమ పార్టీ 175 సీట్లకు 175 గెలవడం ఖాయమన్నారు. ఐరన్ లెగ్ లోకేష్ పాదయాత్ర ప్రారంభించిన మొదటి రోజే వారి కుటుంబ వ్యక్తిని ఆస్పత్రిలో చేర్పించారని, ఇంకెంతమందిని ఆస్పత్రి పాల్జేస్తారో అని ప్రజలు హేళన చేస్తున్నారన్నారు. చౌకబారు ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో వై.మస్తానప్ప, పిట్టా రెడ్డి, కర్రి దాలినాయుడు, ఎన్నేటి రమణ, నమ్మి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల చొరవతో తల్లి చెంతకు బాలుడు



ట్రాఫిక్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ సంరక్షణలో ..



తల్లి, టీచర్లతో నిహాన్

అక్కిరెడ్డిపాలెం: శుక్రవారం ఉదయం 11 – 12గంటల మధ్య సమయం.. ట్రాఫిక్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ షీలానగర్ సిగ్నల్‌పాయింట్ వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంతలో అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఓ బాలుడు ఏడుస్తూ కనిపించాడు. వెంటనే ఆ బాలుడి నుంచి వివరాలు సేకరించి, అతడు చదువుతున్న పాఠశాలకు చేర్చాడు. వివరాలివి.. ఎన్ఏడీ సమీపంలోని శాంతిపురానికి చెందిన అల్లు నిహాన్ బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన నిహాన్ పుస్తకం తీసుకురాకపోవడంతో, వెంటనే తేవాలని టీచర్ పంపించారు. ఎలా వెళ్లాడో తెలియదు గానీ, నిహాన్ షీలానగర్ అయ్యప్పస్వామి ఆలయ పరిసరాల్లో దీనంగా సంచరిస్తూ ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు చంద్రశేఖర్‌కు కనిపించాడు. వెంటనే ఆయన గాజువాక ట్రాఫిక్ ఎస్ఐ అప్పలనాయుడుకు సమాచారం అందించారు. ఎస్ఐ ఆదేశాలతో కానిస్టేబుల్ స్వయంగా బాలుడు ఇచ్చిన వివరాల ప్రకారం బుచ్చిరాజుపాలెంలో పాఠశాలకు తీసుకువెళ్లి, టీచర్‌కు అప్పజెప్పారు. పాఠశాల ఉపాధ్యాయుడు బాలుడి తల్లిని పిలిపించి, అప్పగించారు. తండ్రి లేని బాలుడిని క్షేమంగా అప్పగించడంతో తల్లి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సింటర్ ప్లాంట్ విభాగంలో శుక్రవారం కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. పెదగంట్యాడ హెచ్‌బీ కాలనీకి చెందిన లక్కోజు ఈశ్వరరావు (50) సింటర్ ప్లాంట్ విభాగంలోని రా మెటీరియల్ ప్రిపరేషన్ ప్లాంట్ (ఆర్ఎంపీ) సెక్షన్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం యథావిధిగా ఏ షిఫ్ట్ విధులకు వెళ్లిన ఈశ్వరరావు డిస్క్ ఫీడర్ వద్ద పడిపోయి కనిపించడంతో సహోద్యోగులు కాంట్రాక్ట్ సూపర్‌వైజర్‌కు తెలియజేశారు. వెంటనే అతన్ని మెయిన్ గేటు సమీప ఫస్ట్ ఎయిడ్ కేంద్రానికి, అనంతరం ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఏఎస్ఐ కె. త్రినాథ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అపార్ట్‌మెంట్‌వాసుల ధర్నా


ఇళ్ల నుంచి చెత్త తీసుకెళ్లడం లేదని నిరసన



ధర్నా చేస్తున్న అపార్ట్‌మెంట్‌వాసులు

గాజువాక : యూజర్ చార్జీలను చెల్లించలేదన్న కారణంతో ఇళ్ల నుంచి చెత్తను తీసుకెళ్లడం మానేయడంపై పలు అపార్ట్‌మెంట్లవాసులు జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. తమ ఇళ్లలో చెత్తను జోనల్ కార్యాలయానికి తీసుకొచ్చి నిరసన తెలిపారు. ఇళ్లలోని చెత్తను తీసుకెళ్లాలని, మురుగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఎం గాజువాక కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ ఒక్కో అపార్ట్‌మెంట్ నుంచి పన్నుల రూపంలో ఏడాదికి రూ.15 లక్షలు చెల్లిస్తున్నారని, ఇప్పుడు కొత్తగా వచ్చిన క్లాప్ వాహనాల యూజర్ చార్జీలను చెల్లించకపోతే చెత్త తీసుకెళ్లరా అని ప్రశ్నించారు. జీవీఎంసీ ఇలా వ్యవహరించడం చట్టవ్యతిరేకమన్నారు. ఇలాంటి చార్జీలను పెద్దపెద్ద పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థల వద్ద వసూలు చేయడం మానేసి, సామాన్యులపై రుద్దడం దారుణమన్నారు. కార్యక్రమంలో వివిధ అపార్ట్‌మెంట్ల అసోసియేషన్ల నాయకులు తవిటయ్య, ఎం.వి.రమణ, తవుడన్న, మాధవి, బాలు, డి.అప్పారావు, లక్ష్మి, నాగేశ్వరరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెదగంట్యాడ: ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, న్యూపోర్టు ట్రాఫిక్ ఏఎస్ఐ ఎ.చంద్రశేఖర్ సూచించారు. రహదారి భద్రతపై శ్రీవికాస్ పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ర్యాలీని వారు ప్రారంభించి, మాట్లాడారు. ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్లలో ప్రయాణించేటపుడు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. అనంతరం బీసీ రోడ్డులో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వేగం వద్దు–ప్రాణం ముద్దు, చిన్న తప్పిదం–పెద్ద ప్రమాదం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరం అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాధిక, కరస్పాండెంట్ చంద్రశేఖర్, ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆర్.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.


చిత్రలేఖన పోటీల్లో 11మందికి బంగారు పతకాలు



గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కూర్మన్నపాలెం: గుంటూరుకు చెందిన క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ జనవరిలో నిర్వహించిన నేషనల్ ఫైన్ ఆర్ట్స్ పోటీల్లో కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 11మంది విద్యార్థులు బంగారు పతకాలను సాధించారు. 5 నుంచి పదో తరగతి వరకు వందమంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా 11మంది గోల్డ్‌మెడల్స్ సాధించగా, మిగిలిన వారికి మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారని ప్రధానోపాధ్యాయుడు బి.సూర్యప్రకాశరావు చెప్పారు. గోల్డ్‌మెడల్స్ సాధించిన 5వ తరగతికి చెందిన ఎం.మౌనిక, 6వ తరగతి చదువుతున్న సీహెచ్.చరిష్మ , పి.షర్మిల, వై.మాధవి, 7వ తరగతి విద్యార్థులు ఎం.శ్రీసాయి, కె.లిఖిత, 8వ తరగతికి చెందిన బి.రక్షిత, 9వ తరగతి విద్యార్థినులు కె.పూజిత, పి.రాజేశ్వరి, 10వ తరగతికి చెందిన బి.సిరిజాయ్, హెచ్.జగదీష్ లను పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. కార్యక్రమంలో ఆర్ట్ టీచర్ ఎస్.ఎస్.బి.రుషి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్రీనివాసరావు, పీడీ ఎం.మన్నాజీ తదితరులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లావణ్య

అగనంపూడి: జంతువులు కూడా మనుషుల వలే ప్రాణులని, వాటిని హింసించడం నేరమని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ లావణ్య అన్నారు. జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా అగనంపూడి వెటర్నరీ ఆస్పత్రి ఆధ్వర్యంలో అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జంతు సంక్షేమం, సంరక్షణపై అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నగరం, మఫిసల్ ప్రాంతాల్లో పశువులను రోడ్ల మీద మేతకు విడిచిపెట్టడంతో అవి రోడ్డు మీద దొరికే ప్లాస్టిక్ వ్యర్థాలు, కాగితాలు తిని, జీర్ణ సంబంధమైన వ్యాధులతో అనారోగ్యానికి గురవుతున్నా యని తెలిపారు. పక్షుల ఆవాస స్థావరాలను ఇబ్బంది పెట్టకూడదని సూచించారు. తరువాత విద్యార్థులతో కైండ్‌నెస్ క్లబ్‌లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణారావు, ఎస్ఎస్ ఉపాధ్యాయిని కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

30న మెగా రక్తదాన శిబిరం

పెదగంట్యాడ: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 30న మెగా రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నామని మహాత్మా మదర్ థెరిసా ట్రస్ట్ అధ్యక్షుడు జాగారపు శ్రీను తెలిపారు. ఈ మేరకు దల్లివానిపాలెం జంక్షన్‌లో రక్తదాన శిబిరం పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 29 రక్తదాన శిబిరాలు నిర్వహించామని, సుమారు పది వేల మందికి పైగా రక్తం అందజేశామని చెప్పారు. ఈ నెల 30న నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గంధం సాయి, జాగారపు జాజిబాబు, సునీల్ రెడ్డి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

బీజేపీ బలోపేతానికి కృషి

పెదగంట్యాడ: బూత్ స్థాయిలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు పిలుపునిచ్చారు. బీజేపీ ప్రవాస్ యోచన, గృహ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 75వ వార్డు పరిధి దుర్గవానిపాలెం, ఎస్సీ కాలనీలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బూత్ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. వెంకటేష్, వెంకటరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.